ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదుపులో
ఇద్దరు కల్లు వ్యాపారులు

బోధన్, నవంబర్ 24: బోధన్ ప్రాంతానికి చెందిన ఇద్దరు కల్లు వ్యాపారులను హైదరాబాద్‌కు చెందిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఆదివారం అదుపులోకి తీసుకుంది. ఈ ఇద్దరిలో ఒకరు బోధన్ మండలం సాలూర గ్రామానికి చెందిన వ్యక్తి కాగా, మరొకరు బోధన్ పట్టణానికి చెందిన వ్యక్తి. ఈ ఇద్దరినీ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వారి సెల్‌ఫోన్ల లొకేషన్ ఆధారంగా బోధన్‌కు శనివారం అర్ధరాత్రికే వచ్చి ఆదివారం తెల్లవారుతుండగా వారిని పట్టుకుని హైదరాబాద్‌కు తీసుకెళ్లినట్లు తెలిసింది. ఆ ఇద్దరు వ్యాపారులకు కల్లులో కల్తీ చేసేందుకు సంబంధించిన అల్ప్రాజోలం తదితర నార్కొటిక్ మందుల సరఫరాతో సంబంధం ఉన్నదన్న సమాచారంతోనే వారిని విచారించేందుకు తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ విషయమై బోధన్ పోలీసులను వివరణ కోరగా, తమకు ఎటువంటి సమాచారమూ లేదని తెలిపారు.

పంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలి

మాట్లాడుతున్న రమేశ్

ధర్పల్లి, నవంబర్ 24 : గ్రామాల్లోని పంచాయతీల్లో పని చేస్తున్న పంచాయతీ కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా కార్యదర్శి ఆర్.రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రమేశ్ హాజరై మాట్లాడారు. పంచాయతీ కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని, వారికి నెలల తరబడి జీతాలు అందించడం లేదని అన్నారు. జీవో 60 ప్రకారం వేతనాలు పెంచి కార్మికులను పర్మనెంట్ చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు సాయిలు, విలాస్, గంగన్న, అనంతయ్య, సునీత రాజన్న పాల్గొన్నారు.

షాపు ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనం చోరీ

వినాయక్‌నగర్, నవంబర్24: నిజామాబాద్ నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియాలో ఓ షాపు ఎదుట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాని దుండగుడు దొంగిలించుకుపోయాడు. స్థానిక పెద్ద బజార్ చౌరస్తాలో ఉన్న ఓ పాల ఏజెన్సీ నిర్వాహకుడు విజయ్ తన షాపుషటర్ ఎదుట ద్విచక్ర వాహనాన్ని శనివారం రాత్రి పార్క్ చేశాడు. ఆదివారం తెల్లవారు జామున 3.10 గంటల సమయంలో దొంగ ఎత్తుకెళ్లాడు. నిందితుడు స్వెటర్ ధరించి వచ్చి చోరీకి పాల్పడినట్లు సీసీ టీవీ పుటేజీలో నమోదైంది. బాధితుడు విజయ్ సంగ్వాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో దొంగతనం

వినాయక్‌నగర్, నవంబర్24: జిల్లా కేంద్రంలోని ఆటో టౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియాలో తాళం వేసి ఉన్న ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. బంగారు నగలతోపాటు నగదును దోచుకుపోయారు. స్థానిక వెంగళ్‌రావ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న మహ్మద్ గౌస్ తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి దవాఖానకు చికిత్స నిమిత్తం వెళ్లారు. వారు తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం ధ్వంసం చేసి ఉంది. లోనికి వెళ్లి పరిశీలించగా ఇంట్లోని వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉన్నాయి. ఇంట్లో చోరీజరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. నాలుగు తులాల బంగారు నగలతోపాటు రూ.80 వేల వరకు నగదు చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలాని పరిశీలించిన ఆరో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'హక్కుల హననానికి వ్యతిరేకంగా సంఘటితం కావాలి'

బోధన్, నవంబర్ 24: మానవ హక్కుల హననం ఏ కోణంలో జరిగినా అందుకు వ్యతిరేకంగా అందరం సంఘటితంగా ఉద్యమించాలని మానవ హక్కుల వేదిక మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రెపాటి మాధవరావు అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని లయన్స్ కంటి దవాఖాన మీటింగ్ హాల్‌లో మానవ హక్కుల వేదిక 7వ జిల్లా మహాసభ నిర్వహించారు. సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాధవరావు మాట్లాడుతూ రాజ్యాంగంలోని జీవించే హక్కు, భావప్రకటన స్వేచ్ఛ నేటి ప్రజాస్వామిక వ్యవస్థలో అపహాస్యం పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రాజ్యాంగ దార్శనికులు కలలుగన్న సమానత్వం, స్వేచ్ఛ, హక్కులు మసకబారుతున్నాయని పేర్కొన్నారు. ప్రశ్నించే

మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది మాధవరావు

గొంతుకలను ప్రభుత్వాలు క్రూరంగా అణచివేస్తున్నాయని, ఈ వైఖరి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని వివరించారు. మానవ హక్కుల వేదిక హక్కుల రక్షణ కోసం పోరాడుతుందని, ఈ ఉద్యమంలో మేధావులు, విద్యావంతులు, ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మహాసభకు మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు గడ్డం గంగులు అధ్యక్షత వహించారు. సభలో వేదిక కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సల్ప రమేశ్, వేదిక జిల్లా ప్రతినిధులు సరిత, అహ్మద్, అరుణ రేఖ, మీనా సహాని, మారుతి, అరుణ్, నరేందర్, న్యాయవాదులు సంగం, రమేశ్, అన్వేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో కమ్మ కులస్తులు క్రియాశీలక పాత్ర పోషించాలి

- అన్ని రంగాల్లో రాణిస్తున్న కమ్మ కులస్తులు
- కార్తీకమాసం ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు

బోధన్, నవంబర్ 24: సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటున్న కమ్మ కులస్తులు మరింతగా సామాజిక సేవలో నిమగ్నమవ్వాలని, సమాజంలోని పేదలు, అభాగ్యులను ఆదుకునే దిశగా తమ ఆలోచనలు ఉండాలని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణ శివారులోని కమ్మ సంఘ ప్రాంగణంలో బోధన్ కమ్మ సంఘం ఆధ్వర్యంలో 'కమ్మ కులస్తుల కార్తీకమాస వనభోజనాల ఆత్మీయ సమ్మేళనం' కార్యక్రమం నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండవ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కమ్మ కులస్తులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఒకప్పుడు

మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు – నళిని దంపతులకు జ్ఞాపికను అందిస్తున్న నాయకులు

వ్యవసాయాన్ని అభివృద్ధి చేస్తే నేడు విద్య, వైద్యం, మీడియా, టెక్నాలజీ రంగాల్లో తమ సేవలను అందిస్తున్నారన్నారు. కమ్మ కులస్తుల్లో పేదవారు కూడా ఉన్నారని, పేద పిల్లల చదువుకు కమ్మ సంఘం ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. బోధన్‌లో కమ్మ సంఘం, కాకతీయ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులను చక్కటి వసతి కల్పిస్తూ చదివించటం అభినందనీయమన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో ప్రముఖ సంఘ సేవకుడు ముమ్మలనేని రాజశేఖర్, ప్రముఖ వైద్యురాలు కోడె సుచరిత, మండవ వెంకటేశ్వరరావు సతీమణి మండవ నళిని, బోధన్ కమ్మ సంఘం అధ్యక్షుడు పల్లెంపాటి శివన్నారాయణ మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనంలో కమ్మ సంఘం అధ్యక్షుడు పల్లెంపాటి శివన్నారాయణతో పాటు ఆత్మీయ సమ్మేళనం ఆ సంఘం కార్యదర్శి హరనాథ్‌బాబు, కోశాధికారి పల్లెంపాటి శ్రీధర్ , ప్రోగ్రాం చైర్మన్ పావులూరి వెంకటేశ్వరరావు, కో-చైర్మన్ చదలవాడ వెంకటేశ్వరరావు, కమ్మ సంఘం ప్రతినిధులు పి.గాంధీ, ఈవీ రంగారావు, పాపారావు, చలసాని శ్రీధర్, సుధాకర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

9వ రాష్ట్ర సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో చాంపియన్‌గా జిల్లా జట్టు

కంఠేశ్వర్, నవంబర్ 24: మెదక్ జిల్లా మాసాయిపేట్‌లో ఈనెల 23, 24వ తేదీల్లో నిర్వహించిన 9వ రాష్ట్ర సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా బాలుర జట్టు ఫైనల్ మ్యాచ్‌లో మెదక్ జట్టుపై 07-01 పరుగుల తేడాతో విజయం సాధించి టోర్నమెంట్ చాంపియన్‌గా నిలిచింది. జట్టుకు ట్రోఫీ, బంగారు పతకాలను మెదక్ జిల్లా విద్యాశాఖాధికారి రాధాకృష్ణన్ అందజేశారని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు విప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మార్కంటి గంగామోహన్ తెలిపారు. రాష్ట్ర ఉత్తమ ఫిక్చర్ రోహిత్ ప్రత్యేక బహుమతిని అందుకున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేశ్‌గౌడ్, జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు పి.నీరజారెడ్డి, సంగీతరావు, పవన్‌కుమార్, రాజ్‌కుమార్, రాజేందర్, టి.సునీత, మార్కంటి సుజాత, చిప్ప నవీన్, సురేశ్ క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

ధర్పల్లి, నవంబర్ 24: జిల్లాలోని శాఖ గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంరికార్డుల నిర్వహణ, పుస్తకాల నిర్వహణ పాఠకులు ఏ మేరకు వస్తున్నారో పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరికొండ మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయానికి నూతన భవన నిర్మాణం కోసం కలెక్టర్‌ను సంప్రదించగా ఆయన 600 గజాల స్థలం అందిస్తానని చెప్పారన్నారు. దీంతోపాటు జిల్లాలోని అన్ని శాఖ గ్రంథాలయాలల్లో సదుపాయాలను కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ధర్పల్లి శాఖ గ్రంథాలయానికి సైతం మరమ్మతులు, సౌకర్యాల కల్పన కోసం రూ.5 లక్షల నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. దీంతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలినారు. అనంతరం ఆయనను నాయకులు చెలిమెల నర్సయ్య, బాలయ్య తదితరులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకులు కిషన్, బాలు తదితరులు ఉన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రాజిరెడ్డి

హాస్టళ్లను సందర్శించిన ఎంఈవో

చౌట్‌పల్లి బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

బాల్కొండ, నవంబర్ 24 : ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల హాస్టళ్లలో భోజనం కలుషితం కావడంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలు ఇటీవల ఎక్కడోచోట చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వివిధ హాస్టళ్లను ఎంఈవో బట్టు రాజేశ్వర్ ఆదివారం తనిఖీ చేశారు. కస్తూర్బా బాలికల వసతిగృహం, తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ అమలవుతున్న మెనూ, సానిటేషన్, ఆహార పదార్థాలు నిల్వ చేసిన విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. హాస్టల్‌లో బియ్యం ఇతర వంట సరుకులను నిల్వ చేసిన విధానాన్ని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గంగాకిషన్, కస్తూర్బా పాఠశాలలో సుజాత, మోడల్ స్కూల్ హాస్టల్‌లో వార్డెన్ ఉన్నారు.

బీసీ బాలుర వసతి గృహం తనిఖీ..

మోర్తాడ్, నవంబర్ 24 : కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి గ్రామంలో బీసీ బాలుర వసతి గృహాన్ని ఎంపీడీవో రాజశ్రీనివాస్ ఆదివారం తనిఖీ చేశారు. విద్యార్థుల గదులు, టాయిలెట్లు, భోజనశాలను పరిశీలించారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని, విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, అల్పాహారం అందించాలని సూచించారు.

రన్నింగ్ పోటీలో వేల్పూర్‌వాసికి ద్వితీయ స్థానం

అశోక్‌కు బహుమతి అందజేస్తున్న కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్

వేల్పూర్, నవంబర్ 24 : వరంగల్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి 10 కిలోమీటర్ల పరుగుపందెంలో వేల్పూర్‌కు చెందిన గుగ్గిలం అశోక్ ద్వితీయ స్థానం సాధించాడు. వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ చేతుల మీదుగా అశోక్ గోల్డ్ మెడల్‌తోపాటు సర్టిఫికెట్ అందుకున్నారు. అశోక్ ప్రస్తుతం కామారెడ్డి జిల్లా పరిధిలోని ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ అథ్లెటిక్‌లో జాతీయ, అంతర్జాతీయ ఈవెంట్లలో పాల్గొని రాణిస్తూ, యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఈ సందర్భంగా వేల్పూర్ గ్రామస్తులు అశోక్‌ని అభినందించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్, నవంబర్ 24: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్ట శివాలయంలో ఆదివారం సంత్ సదానందగిరి స్వామి సిద్ధుల గుట్టను సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆకర్షణీయ సిబిల్ స్కోర్‌కు ఆరు సూత్రాలు

పర్సనల్ ఫైనాన్స్‌లో మూడంకెల క్రెడిట్ స్కోర్‌కు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. మన దేశంలో వ్యక్తులు, కంపెనీల రుణ పరపతిని వారివారి రుణ చరిత్రల ఆధారంగా మదింపు చేయడంలో సిబిల్ (క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (ఇండియా) లిమిటెడ్) సమాచారాన్ని ప్రధానంగా రుణదాతలు (బ్యాంకులు, ఇతరత్రా ఆర్థిక సంస్థలు) విశ్వసిస్తున్నారు. 300 నుంచి 900 వరకు క్రెడిట్ స్కోర్లను సిబిల్ ఇస్తున్నది. రుణాలు, క్రెడిట్ కార్డులు తదితర రుణ సదుపాయాల కల్పనలో వ్యక్తులు, సంస్థల అర్హతను నిర్ధారించడంలో ఈ స్కోరే కీలకం. అధిక స్కోర్ రుణగ్రహీతల ఆర్థిక పరిపుష్టికి నిదర్శనంగా నిలుస్తుంది. దీంతో రుణాలు సులభంగా లభిస్తాయి. పైగా తక్కువ వడ్డీరేటుకే దొరుకుతాయి. అలాగే స్కోర్ తగ్గితే రుణ లభ్యత అవకాశాలు కూడా అంతంతమాత్రంగానే ఉంటాయి. వడ్డీరేట్లూ ఎక్కువగానే పడుతాయి. సిబిల్ స్కోర్ 750, అంతకన్నా ఎక్కువగా ఉంటే వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డులను విరివిగా అందుకోవచ్చు. ఒకవేళ స్కోర్ 685 కంటే తక్కువగా ఉంటే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు రుణాలిచ్చేందుకు వెనుకాడుతాయి. కాబట్టి ఆకర్షణీయ సిబిల్ స్కోర్ కూడా ఆర్థిక లక్ష్యాల్లో ప్రధానమే.

స్కోర్ పెంపునకు మార్గాలు

సకాలంలో చెల్లింపులు

క్రెడిట్ స్కోర్‌ను ప్రభావితం చేసే అంశాల్లో సకాలంలో జరిపే చెల్లింపులు కీలకం. తీసుకున్న రుణాలను గడువులోగా చెల్లించడం, వాటి ఈఎంఐలను నిర్ణీత తేదీల్లో మిస్సవ్వకుండా చూసుకోవడం ముఖ్యం. పేమెంట్లలో ఆలస్యం క్రెడిట్ స్కోర్‌ను వేగంగా తగ్గించడమేగాక, డిఫాల్టర్ (ఎగవేతదారు లేదా మొండి బకాయి)గా మార్చే ప్రమాదమూ ఉన్నది. దీని వల్ల భవిష్యత్తులో రుణ సదుపాయాలను అందుకోవడం కష్టమవుతుంది. ముఖ్యంగా గృహ, వాహన రుణాలు పొందడం పెద్ద సమస్యగానే పరిణమిస్తుంది.

పరిమితంగా రుణాలు

రుణాలను పరిమితంగా తీసుకోవడమే ఉత్తమం. మనకున్న రుణ పరిమితిలో దాదాపు 30 శాతాన్ని మాత్రమే వినియోగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడే క్రెడిట్ స్కోర్ బాగుంటుందని చెప్తున్నారు. సామర్థ్యానికి మించి ఉండే రుణ భారం వల్ల ఇబ్బందులు తప్పవు. కనుక అత్యవసరమైతే తప్ప రుణాల జోలికి వెళ్లకుండా ఉండటమే తెలివైన పని. అంతేగాక కీలకమైన గృహ రుణాల వంటి వాటికి అర్హత అనేది ఉంటుంది. కాబట్టి ప్రతీ చిన్న అవసరానికి అప్పులు చేయకుండా ఉండాలి.

అప్పుల అన్వేషణ వద్దు

కొత్త రుణాల కోసం తరచూ అన్వేషించడం కూడా మన క్రెడిట్ స్కోర్‌ను రిస్కులో పడేస్తుంది. రుణాల కోసం ఎక్కువగా వాకబు చేయడం వల్ల మన ఆర్థిక పరిస్థితి బాగాలేదన్న సంకేతాలు క్రెడిట్ బ్యూరో సంస్థలకు వెళ్తాయి. దీనివల్ల మన క్రెడిట్ స్కోర్ తగ్గిపోతూ ఉంటుంది. కాబట్టి అవసరం ఉన్నా.. లేకున్నా.. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల వద్దకు వెళ్లి రుణాల కోసం ప్రయత్నించకండి. దానివల్ల రుణదాతలు మీ రుణ చరిత్రను పరిశీలిస్తూ ఉంటారు. పదేపదే ఈ పని జరిగితే అది మీకే నష్టం.

పొరపాట్లను సరిచేయాలి

క్రెడిట్ స్కోర్‌ను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఉండాలి. అప్పుడప్పుడు మనం తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించినప్పటికీ ఆ సమాచారం క్రెడిట్ బ్యూరోకు ఉండదు. దానివల్ల మన క్రెడిట్ స్కోర్ పెరగకుండా ఉంటుంది. అలాంటప్పుడు రుణదాత (బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ)లను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది. ఇక ఇప్పుడు ఆన్‌లైన్‌లో చాలా ఏజెన్సీలు ఉచితంగానే మనకు క్రెడిట్ స్కోర్‌ను తెలియజేస్తున్నాయి. కనుక తరచూ మన స్కోర్‌ను చెక్ చేసుకోవడం ఉత్తమం.



గ్యారంటీలకు దూరంగా..

గ్యారంటీలకు దూరంగా ఉండాలి. మనలో చాలామంది స్నేహితులనో, బంధువులనో, తెలిసినవారు లేదా ఇరుగుపొరుగువారంటూ వారి రుణాలకు పూచికత్తు సంతకాలు చేస్తూ ఉంటాం. కానీ ఇదంత శ్రేయస్కరం కాదని ఆర్థిక నిపుణులు, బ్యాంకింగ్ వర్గాలు చెప్తున్నాయి. ఒకవేళ వారు తీసుకున్న రుణాలను చెల్లించకపోతే ఆ రుణ భారం మీ మీద పడుతుంది. ఆ రిస్కు పెరిగితే ఆటోమేటిగ్గా మీ క్రెడిట్ స్కోర్ సైతం క్షీణిస్తూ పోతుందన్న విషయం మరువద్దు. అందుకే తప్పని పరిస్థితుల్లో తప్ప వీలైనంత వరకు గ్యారంటీలకు దూరంగా ఉండాలి.

సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు

సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు వ్యక్తుల క్రెడిట్ స్కోర్‌ను పెంచడంలో దోహదపడుతాయి. సాధారణ క్రెడిట్ కార్డుల మాదిరి కాకుండా ఈ సెక్యూర్డ్ క్రెడిట్ కార్డులు మీరు చేసే డిపాజిట్ల ఆధారంగా లభిస్తాయి. పరిమిత రుణ చరిత్ర ఉన్నవారు, క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉన్నవారు వీటిని తీసుకొని మెరుగైన స్కోర్‌ను సాధించవచ్చు. మీరెంత నగదు డిపాజిట్ చేస్తే.. దానికి సమాన స్థాయిలోనే సదరు క్రెడిట్ కార్డు రుణ సదుపాయ పరిమితి ఉంటుంది. సకాలంలో కార్డు బిల్లులను చెల్లిస్తూపోతే స్కోర్ క్రమేణా పెరుగుతూపోతుంది.

రాజడి

పిల్లల విద్య కోసం..

పిల్లల విద్య కోసం ప్రణాళిక అనేది తల్లిదండ్రులకున్న అత్యంత కీలక ఆర్థికాంశం. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే వారి ఉన్నత విద్య ఖర్చుల కోసం పొదుపు చేయడం ఎంతో తెలివైన పని. అయితే అందుకున్న మార్గాలను పరిశీలిస్తే..

ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లు

పిల్లల ఉన్నత విద్య వంటి దీర్ఘకాల లక్ష్యాల కోసం స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు సరైన నిర్ణయమనే చెప్పవచ్చు. మ్యూచువల్ ఫండ్లలో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్) ద్వారా ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టవచ్చు.



హైబ్రిడ్ ఫండ్స్

హైబ్రిడ్ ఫండ్స్.. అటు ఈక్విటీల్లో, ఇటు డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెడుతాయి. వీటిలో రిస్క్, రిటర్న్స్ అనేవి సమతూకంగా ఉంటాయి.

విద్యా పథకాలు

వివిధ మ్యూచువల్ ఫండ్స్ పిల్లల విద్య కోసం రకరకాల పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. ఇవి ఈక్విటీలు, రుణ లేదా బంగారాల్లో పెట్టుబడులు పెడుతాయి.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు

తక్కువ రాబడులను అందించినా.. సురక్షిత పెట్టుబడులుగా వీటిని చెప్పుకోవచ్చు. ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే వీటిలో రిస్క్ ఉండదు. కచ్చితమైన రాబడులుంటాయి.

విద్యా రుణాలు

ట్యూషన్ ఫీజులు, రోజువారీ జీవన ఖర్చులు, ఇతరత్రా వ్యయాలను ఈ విద్యా రుణాలతో అధిగమించవచ్చు. పిల్లల విద్య పూర్తయిన తర్వాత తిరిగి చెల్లించేలా మారటోరియం పీరియడ్‌కు వీలుంటుంది. అంతేగాక పాత పన్ను విధానం కింద ఆదాయ పన్ను (ఐటీ) చట్టం లోని సెక్షన్ 80ఈ ద్వారా రుణగ్రహీతలు పన్ను మినహాయింపులనూ అందుకోవచ్చు.

బీమా ప్లాన్లు

చైల్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు.. అటు పెట్టుబడి, ఇటు బీమా సదుపాయంతో ఉంటాయి. ఒకవేళ పాలసీదారు దురదృష్టవశాత్తు చనిపోతే ఒకేసారి పెద్దమొత్తంలో కుటుంబీకులకు ధనసాయం లభిస్తుంది.

ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తారా?

ఒక కంపెనీ షేర్లను దాని ఈక్విటీలో పాల్గొని మదుపరులు కొనుగోలు చేయవచ్చు. లిస్టెడ్ కంపెనీలైతే వాటి షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదై ఉంటాయి. దీంతో ఎక్స్ఛేంజీల ద్వారా వాటిని కొనవచ్చు. ఇందుకు డిపాజిటరీ పార్టిసిపెంట్‌తో కూడిన డీమ్యాట్ అకౌంట్, బ్యాంక్ అకౌంట్‌లు అవసరం. అలాగే షేర్ల క్రయవిక్రయాల కోసం బ్రోకర్‌తో ఓ ట్రేడింగ్ అకౌంట్‌ను తెరవడం కూడా ముఖ్యమే.

ఈటీఎఫ్‌ల ద్వారా..

ఏదో ఒక షేర్‌లో పెట్టుబడులు పెట్టడానికి బదులుగా ఎక్స్ఛేంజ్‌పై నమోదైన ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఇండెక్స్ ఫండ్స్ (ఈటీఎఫ్)ను కొనడం ద్వారా మొత్తం ఇండెక్స్‌లోనే పాలుపంచుకోవచ్చు. అలాగే ఈటీఎఫ్ ఇన్వెస్ట్‌మెంట్.. పెట్టుబడి వైవిధ్యాన్ని కూడా చూపిస్తుంది.

ఈక్విటీ ఎంఎఫ్‌లు

ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) స్కీముల ద్వారా కూడా ఈక్విటీల్లో మదుపు చేయవచ్చు. ఈ పథకాలు తమ దగ్గరున్న నిధుల్లో 65 శాతం లేదా అంతకన్నా ఎక్కువ మొత్తాలను ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీల్లో పెట్టుబడిగా పెడుతాయి. ఎంఎఫ్ వెబ్‌సైట్ల నుంచి ఆన్‌లైన్‌లో లేదా డిస్ట్రిబ్యూటర్ ఆధారిత ఎంఎఫ్ లావాదేవీ పోర్టల్‌ల ద్వారా పెట్టుబడులకు వీలుంటుంది. సిప్ ద్వారా కూడా పెట్టుబడులకు దిగవచ్చు.

ఒడిదొడుకుల్లోనే పయనం



దేశీయ స్టాక్ మార్కెట్లలో తీవ్ర స్థాయిలో ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. గడిచిన నెల 15 రోజులుగా సూచీలు పడుతూలేస్తూనే పయనిస్తున్నాయి. దేశ, విదేశీ ప్రతికూలతల నడుమ మదుపరులు పెట్టుబడుల విషయంలో ఆచితూచి స్పందిస్తున్నారు. అయితే అమ్మకాలు.. లేదంటే కొనుగోళ్లకు పెద్దపీట వేస్తూ పోతున్నారు. ఈ క్రమంలోనే గత వారం సూచీలు పెద్ద ఎత్తున లాభాలను అందుకున్నాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,536.80 పాయింట్లు లేదా 1.98 శాతం ఎగిసి 79,117.11 వద్ద నిలిచింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 374.55 పాయింట్లు లేదా 1.59 శాతం ఎగబాకి 23,907.25 దగ్గర ముగిసింది. ఆ మునుపటి వారం ఇంతకన్నా ఎక్కువ నష్టాలపాలైన సంగతి విదితమే. ఇక ఈ వారం విషయానికొస్తే.. మార్కెట్లను ప్రభావితం చేసే అంశాలు